# ఆకుపచ్చని జీవితం

బ్యాంకు నించి ఇంటికి వచ్చేసరికి శ్రీమతి చెప్పిన వార్త... మనసుకెంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించింది.. !

సాయంత్రం అయిదున్నర...! బట్టలు మార్చుకుని దివాన్‌మీద కూర్చున్నాను... శ్రీమతి ఒక కప్పు టీ నా చేతికిచ్చి, తనో కప్పు తెచ్చుకుంది.

"ఏవండీ.. శ్రావణికి పెళ్ళి కుదిరిందట. రేపు పదకొండు గంటలకి నిశ్చితార్థం అట... బంధువుల్ని ఎవర్నీ పిలవడంలేదట. మిమ్మల్నీ నన్నూ తప్పనిసరిగా రమ్మని ఇప్పుడే చెప్పివెళ్ళారువాళ్ళు..." శ్రీమతి ముఖంలో, మాటల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

"శ్రావణికి మళ్ళీ పెళ్లా... ? చాలా మంచి వార్త చెప్పావోయ్... పోనీలే .. పెళ్లి కుదరడం ఆ పిల్ల అదృష్టం... అంతకుమించి ఆ పిల్లకు పెళ్లిచేయాలనే దిశగా తల్లీతండ్రీ ఆలోచించడం... అది ఫలించడం గొప్ప అదృష్టం... !" ఉద్వేగంతో అన్నాను.

"అవునండీ.. ఒకసారి పెళ్లయిన పిల్లకు మళ్లీ పెళ్లి కుదరడం అంటే మాటలా ... ? ఎవరో దూరపు బంధువు ఈ సంబంధం తీసుకువచ్చి పుణ్యంకట్టుకున్నాట్ట. ఆ కుర్రాడికి ముసలి తల్లి, ఓ మేనమామ తప్ప ఎవరూ లేరట. తండ్రి పోగా, పేపరు మిల్లులో ఉద్యోగం ఇచ్చారట... శ్రావణి ఫోటో చూసి అబ్బాయి ఇష్టపడుతున్నాడట... శ్రీమతి వివరాలు చెప్పింది. నాకెంతో సంతృప్తిగా అనిపించింది.

" సరేనోయ్! రేపెలాగూ ఆదివారం... తప్పక వెళ్లి చూసొద్దాం...!" శ్రావణిరూపం కళ్లల్లో కదులుతూండగా అన్నాను.

శ్రావణి మా బంధువుల పిల్లకాదు... స్నేహితుల అమ్మాయి కాదు.. అంతకంటే అభిమానంతో, దగ్గరతనంతో మాతో కలిసిపోయిన కాంతమ్మ, సీతయ్యల ఏకైక కుమార్తె. వాళ్లు మాకు పదేళ్ళకు పైగా పాలు పోస్తున్నవాళ్లు. కాంతమ్మ, సీతయ్యలకు ఓ అరడజను గేదెలున్నాయి. మా ఇంటికి అరఫర్లాంగు దూరంలో రోడ్డుకు ఎడంగా ఒక పాతకాలపు పెంకుటిల్లు, పెద్ద పెరడు ఉన్నాయి. రైతు కుటుంబం... మట్టిమనుషులు... మంచి మనుషులు. మూడు ఎకరాల మాగాణీ పొలం కూడా ఉంది. భార్యా భర్తలిద్దరికీ చదువు తక్కువేమో - వ్యాపారపరంగా, వ్యక్తిగతంగా... సలహాలకీ సంప్రదింపులకీ మా ఇంటికి వచ్చిపోతుంటారు. మమ్మల్నిద్దర్నీ అమ్మాయి, అల్లుడుగారంటూ ఆత్మీయంగా పలకరిస్తూంటారు.

శ్రావణి అయిదారేళ్ల వయసునుంచీ మాకు తెలిసిన పిల్ల. మా ఇంటికి పాలుతెచ్చే అన్నలిద్దరితో పాటు తనూ వచ్చేది. గంటలతరబడి మా పిల్లలతో ఆడుకునేది. వాళ్ళింట్లో

ఏ గేదె ఈనినా జున్నుపాలతో మా ఇంట్లో ప్రత్యక్షమయ్యేది. పొలం నుంచి ఏపలమో, కాయగూరో మా అమ్మ ఇమ్మందంటూ, మా అయ్య ఇచ్చాడంటూ పట్టుకువచ్చేది. శ్రావణి ముద్దమందారంలా ఉంటుంది. ముదొచ్చే రూపం ఆ పిల్లకు... నవ్వడం తప్ప నాకేం తెలియదన్నట్టుగా నవ్వుతూ గలగలా మాట్లాడడం... మాట్లాడుతూ కిలకిలా నవ్వడం ఆ పిల్లకు సహజంగా అబ్బిన అందాలు.... !

శ్రీమతికి ఆ పిల్ల కబుర్లు నవ్వులు బోలెడిష్టం... మాకు ఆడపిల్లలు లేకపోవడమో ఏమో శ్రావణంటే ప్రత్యేకమైన ఆపేక్ష. సీతయ్య, కాంతమ్మ మగపిల్లల్ని చదివిస్తూ, ఆడపిల్లకి ప్రాథమిక బళ్లో చదువు చాల్లే బాబూ అంటూ సరిపెట్టబోతూంటే... శ్రావణిని ఊళ్లోనే ఉన్నత పాఠశాలలో చేర్పించమని గొడవచేసి చేర్పించింది మేమే. శ్రావణి ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ ఆడుతూ పాడుతూనే చదివింది. ఎవరూ ఊహించని రీతిలో పదవతరగతిలో అయిదు వందల యాభై మార్కులు తెచ్చుకుంది. ఆ పిల్ల చదువు అంతటితో ఆగిపోకూడదు, అనుకున్నాను నేను.

పదవతరగతి ఫలితాలొచ్చిన పక్షం రోజుల తర్వాతేమో... కాంతమ్మ, సీతయ్యలు మా ఇంటికొచ్చి శ్రావణికి పెళ్లంటూ కబురు చెప్పారు.

"శ్రావణికి అప్పుడే పెళ్లేమిటి... ? పదిహేనేళ్లు వచ్చాయేమో అంతేగా... ? " ఆశ్చర్యంగా అన్నాను.

" పదేను నిండినాయి బావూ.. అయినా మేనరికం. మా అక్క కొడుకేనయ్యా...కుర్రోడు అయిద్రాబాదులో ఏదో ఏపారం సేత్తనాడంట... బాగా ఆస్తిపాస్తులున్నోల్లే... పిల్ల సుకపడుద్దయ్యా... !" సీతయ్య ముఖంలో అవ్యక్తమయిన వెలుగు.... !

" అవునయ్యా... ఆడపిల్ల పెళ్లంటే మీకు తెలీనిదేటుందయ్యా... పిల్ల ఈడేరినకాన్నించి ఈ సంబంధంఅనుకుంటున్నదేనయ్యా...." కాంతమ్మ, సీతయ్యకు వంతపాడింది.

" శ్రావణికి పద్దెనిమిదేళ్ళు నిండలేదు. చిన్న వయసులో పెళ్లంటే... ఆడపిల్లలకి చాలా ఇబ్బందులొస్తాయి. అందులోనూ మేనరికం సంబంధం- తొందరేం వచ్చింది? పిల్ల తెలివిగా చదువుకుంటోందికదా...!" నచ్చచెప్పాలని శాయశక్తులా ప్రయత్నించాను.

" అలీసం సేత్తే మేనరికం తప్పిపోద్దయా...." సీతయ్య బెంగగా అన్నాడు.

" ఈ పెళ్ళి విషయంలో శ్రావణి ఏవంటోంది...?" కుతూహలంగా అడిగాను.

" సిన్నపిల్ల... దానికేటి తెలుత్తాదిబావు... మంచీసెడ్డా పెద్దోళ్లం మనవే సూడాలయ్యా..."

సీతయ్య, కాంతమ్మల నిర్ణయం ఈ పెళ్లి విషయంలో బలీయంగా ఉంది. నేను బదులు పలకలేదు... మౌనంగా ఉండిపోయాను.

ఆ సాయంత్రం శ్రావణి మా ఇంటికొస్తే... " నీకు పెళ్లట కదా.. ! కాబోయే మీ ఆయన్ని చూసావా ?" అంటూ శ్రీమతి మేళమాడింది. పెళ్ళన్నా, కాబోయే మొగుడన్నా

ఆ పిల్లకు కనీసం సిగ్గుపడటం కూడా రాదు. అదే నవ్వు స్వచ్ఛమైన పసిపిల్లలాంటి నవ్వు. పెళ్లంటే కనీస అవగాహన లేకుండానే, చాలమంది ఆడపిల్లల పెళ్లిళ్ళు జరిగిపోతుంటాయి. నెలరోజులలోపే శ్రావణి పెళ్లి ఆర్భాటంగా జరిగిపోయింది. పాల సీతయ్య్య తన అల్లుడికి ఒక ఎకరం పొలం కట్నంగా ఇచ్చి, మరో ఎకరం భూమి నేను పని చేసే సహకార బ్యాంకులో తనఖాపెట్టి భారీగానేఖర్చుపెట్టాడు. హైదరాబాద్ సంబంధం... హోదా, దర్పం ఎలా ఉన్నా పెళ్లికొడుకు మాత్రం నాకు ఎందుకో నచ్చలేదు. మరీపీలగా ఉన్నాడు. బుగ్గలు లోతుకుపోయి, దవడ ఎముకలు పొడుచుకొచ్చినట్లున్నాయి.. రూపం, రంగు కూడా శ్రావణికంటే తీసికట్టుగా ఉన్నాడు. కాకిముక్కుకు దొండపండు అంటారే... అంతకంటే అన్యాయం అనిపించింది.... ఆ మాటే మా ఆవిడతో అన్నాను.

"పెళ్లయితే ఆడయినా, మగయినా చాలా మార్పులొస్తాయి. పెళ్లినాటికి మీరు పీలగా లేరూ? ఇప్పుడు దుబ్బులా తయారయ్యారు" నవ్వుతూ కొట్టిపడేసింది.

ఏమైనా శ్రావణి ప్రక్కన ఆ కుర్రాడు దిష్టి బొమ్మలా అనిపించాడు. పైగా వయసులో కూడా తేడా ఎక్కువే ఉండచ్చు అనిపించింది.

ఆరునెలల కాలంలో నాలుగైదుసార్లు భర్తతో అమ్మగారింటికి వచ్చింది. ఒకటి రెండుసార్లు మా ఇంటికి వచ్చింది. శ్రావణి భర్త పేరు రమణ. పెళ్లయిన తరువాత రమణ రూపంలో ఏదో మార్పు నాకు నిజంగానే కనిపించింది. అతను చేసే వ్యాపారం గురించి వాకబుచేసాను. ప్రస్తుతం తను ఊళ్ళు తిరుగుతూ చేసే వ్యాపారం మానేసాడు. తండ్రి సలహాతో వేరే కాపురం పెట్టుకున్న తరువాత... కొత్త వ్యాపారం మొదలుపెడతాడు. అతని మాటల్లో మేము బాగా డబ్బున్నోళ్లం అన్న ధ్వని వినిపించింది. శ్రావణి జీవితానికి లోటేమీ లేదనుకున్నాను....!

శ్రావణి కొత్తకాపురం సంవత్సరం తిరిగిందో లేదో... ఒకరోజు సీతయ్య్య కాంతమ్మలు లబోదిబోమంటూ హైదరాబాద్ వెళ్లారు. శ్రావణిని ఒంటరిగా వెంటబెట్టుకుని వచ్చారు.

శ్రావణి భర్తకు హఠాత్తుగా జబ్బుచేసిందట... గుండాగి చనిపోయాడట... మాకు నోట మాటరాలేదు. నిజంగా నమ్మలేని నిజం ఇది. వివరాలు అడిగితే... అనారోగ్యం ఏమీలేదట... రెండ్రోజులు జ్వరం వచ్చిందట. ఏవో బిళ్లలు వేసుకున్నాడట. జ్వరం తగ్గలేదు. మూడోరోజు మధ్యాహ్నం శ్రావణిని తన దగ్గరే కూర్చోమన్నాడట... చేయి పట్టుకుని వదల్లేదట. కడుపులో వికారంగా ఉందని, కాళ్ళు లాగుతున్నాయనీ గుండెల్లో నొప్పిగా ఉందనీ జాలిగా కళ్ళు మూసేసాడట. "పెళ్లాం అంటే ఎంత పిచ్చిప్రేమో బాబూ నా అల్లుడుకి... బిడ్డని ఒంటరిదాన్ని చేసి ఎల్లిపోయాడు నాయనా!" అంటూ కాంతమ్మ సీతయ్య్యలు కన్నీరుమున్నీరుగా ఏడవసాగారు.

"ఇప్పుడేడ్చి చేసేదేముంది? మంచీ, చెడ్డా, అనూపానూ తెలుసుకోకుండా ఆ కుర్రాడికి మేనరికం మోజులో కట్టబెట్టేసారు. ఆ గుండె జబ్బో మరొకటో ఆ కుర్రాడికి ముందే ఉండి

ఉండాలి. ఆ జబ్బు తెలియకుండా వాళ్ళు పెళ్లి జరిపించేసారు. అందరూ కలిసి పచ్చని ఆ పిల్ల బ్రతుకుని అన్యాయం చేసి పడేసారు... ఏమిటి చేయడం?

శ్రావణి ఇప్పుడు గలగలా మాట్లాడదు... కిలకిలా నవ్వదు.... మౌనం ఘనీభవించినట్లు ఎటో చూస్తూ ఉండిపోతుంది. ఇంతాచేస్తే... శ్రావణి వయసిప్పుడు పద్దెనిమిదేళ్లు కూడా నిండలేదు. ఆ పిల్ల రూపం చూస్తే ఎవరికైనా కడుపు తరుక్కుపోతుంది... శ్రావణి అత్తామామల్ని కుర్రాడి ఆరోగ్యం గురించి ప్రశ్నిస్తే... వాళ్లు విరుచుకుపడ్డారట. మీ పిల్లను చేసుకున్నందుకే వాడలా అర్థాంతర చావు చచ్చాడని.... సీతయ్య, కాంతమ్మల్ని తిట్టిపోసారుట. తిరగ బడ్డారట. ఇది మా ఖర్మంటూ పిల్లను కడుపులో దాచుకున్నారు వాళ్ళు. శ్రావణి భర్త పోయిన తరువాత ఇల్లు కదిలేది కాదు. ముఖంలో మునుపటి కళ లేదు. జీవం లేదు. ఎప్పుడైనా మా ఆవిడ వాళ్లింటికి వెళ్లేది. యాంత్రికంగా తల్లిదండ్రులకు ఇంటి పనుల్లో సాయం చేయడం తప్ప... ఆ పిల్ల ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేదికాదు. సాంప్రదాయం, కట్టుబాట్లు... ఈ పిల్ల జీవితం ఇంతేనా అనిపించేది...

ఇదిగో ఇప్పుడు... రెండేళ్ల తరువాత శ్రావణికి మళ్లీ పెళ్లి కుదిరిందట. ఎవరో దూరపు బంధువు పుణ్యంకట్టుకుని ఈ పెళ్ళి చేస్తున్నాడట... ! ఎంత సంతోష వార్త ఇది...? ఆ పిల్ల జీవితంలో వెన్నెలకాయడం... కొత్త వెలుగులు విరజిమ్మడం.... ఆ ముఖంలో మళ్లీ నవ్వులు పూయడం... ఆనందం గంతులేయడం... ఎంత శుభపరిణామం...? శ్రావణి జీవితంలోకి తరలి వచ్చిన వసంతమే కదూ ఈ పెళ్లి...?

మర్నాడు ఆదివారం. ఉదయం పదిన్నరకే మేమిద్దరం శ్రావణి నిశ్చితార్థానికి వెళ్లాం. ఇంటికి వెళ్లేసరికి అప్పటికే హాల్లో కుర్చీల్లో పెళ్ళికొడుకు, అతని తల్లి, మేనమామ, దూరపు బంధువు.. మధ్యవర్తి, మా వీధి వినాయకశాస్త్రి గారు ఆశీనులై ఉన్నారు. శాస్త్రిగారు తీరికగా పంచాంగం తిరగేస్తూ లెక్కలు వేస్తున్నారు. మమ్మల్ని చూసి శ్రావణి అన్నయ్యలిద్దరూ చెరో కుర్చీ తెచ్చి వేసారు. సీతయ్య వచ్చి మాకు నమస్కరించాడు. పెళ్లికొడుక్కి, అతని తల్లికి, మేనమామకి మధ్యవర్తికీ మమ్మల్ని వాళ్ల కుటుంబానికి అత్యంత ఆత్మీయులుగా పరిచయం చేసాడు. పెళ్లికొడుకు లక్షణంగా ఉన్నాడు. శ్రావణిని పెళ్లి చేసుకోవడం ఆ పిల్ల అదృష్టమే అనిపించింది. తల్లి కాంతమ్మ శ్రావణిని తీసుకొచ్చి చాపమీద కూర్చోబెట్టింది. శ్రావణి సాదా అలంకరణలోనే స్వాతిముత్యంలా ఉంది. ఈడూ... జోడూ బావుంది. జంట చూడముచ్చటగా ఉంది. వధూవరులిద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు. చాలాకాలం తరువాత శ్రావణి ముఖంలో మళ్లీ నవ్వులు మొలకెత్తడం... సిగ్గులు పూయడం గమనించాను.

శ్రావణి పెళ్లికొడుకు శంకరానికి నచ్చింది. అతని తల్లి, మేనమామ ముఖాల్లో సంతృప్తి వ్యక్తమయింది. మధ్యవర్తి సీతయ్య, కాంతమ్మలతో మంతనాలు జరిపాడు. వాళ్లు విప్పారిన కళ్లతో అతను చెప్పింది విని, అంగీకారంగా తలలు ఊపారు.

సీతయ్య, కాంతమ్మలు ఈసారి శ్రావణి కోసం ఎక్కువ ముట్టచెప్పడానికే సిద్ధపడినట్లున్నారు. నిశ్చితార్థానికి ముందు నాలో మెదిలే రెండు సందేహాలు సీతయ్యని అడిగి, మధ్యవర్తితో మాట్లాడి తీర్చుకున్నాను. ఒకటి, శ్రావణికి ఒకసారి పెళ్లయిందన్న విషయం వాళ్లకు స్పష్టంగా చెప్పడం జరిగింది. రెండు, శ్రావణికి ఈ పెళ్లి పూర్తిగా ఇష్టమే... నా మనసు తేలికపడినట్లయింది.

వినాయకశాస్త్రి తొందరపడుతూ మంత్రోచ్చారణతో నిశ్చితార్థం కార్యక్రమం మొదలుపెట్టాడు. సరిగ్గా పదకొండూ పది నిమిషాలకు ఇరుపక్షాల పెద్దల్నీ ఎదురురెదురుగా కూర్చోబెట్టి నిర్ణయ ఒప్పందాన్ని పలికించి నిశ్చయ తాంబూలాలు మార్పించాడు. పెళ్లికొడుకు శంకరం, పెళ్లికూతురు శ్రావణి శిరస్సులపై పెద్దలందరితోబాటు మా దంపతులం ఆశీఃపూర్వక, అభినందనలతో అక్షింతలు వేసాం. పూలు, పళ్లు, పసుపు కుంకుమలు, కొబ్బరిబొండాలు, కొత్తబట్టలు, కొత్త బంగారునగలు, తాంబూలాలు కొత్త వాతావరణం మధ్య... శ్రావణి పచ్చగా కళకళలాడింది. మనసులో ముప్పిరిగొన్న కొత్త ఊహలతోనేమో ఆ అమ్మాయి ముఖం కొత్త జీవకళతో వెలిగిపోయింది. శ్రావణి కాబోయే అత్తగారు ఆ పిల్ల మెడలో బంగారు నగవేసి బుగ్గలు పుణికి మురిపెంగా ముద్దుపెట్టుకుంది. వినాయకశాస్త్రి గారు ఇరవై రోజుల తరువాత పెళ్లికి మంచి ముహూర్తం నిర్ణయించారు... వధూవరులు ఒకరికొకరు మాట్లాడుకునేలా చేసారు... నవ్వుకునేలా చతురోక్తులు విసిరారు... ఆటపట్టిస్తూ హాస్యకబుర్లు చెప్పారు. అందరి హృదయాలూ పరవశించి పులకించాయి. సీతయ్య, కాంతమ్మలు తృప్తిగా నిట్టూర్చారు. వాళ్ల భోజనాల ఏర్పాట్లలో ఉండగానే మేము వెనక్కి మళ్ళాము. వాళ్లు మమ్మల్ని కదలనివ్వలేదు. అందరితోబాటు భోజనపంక్తిలో మేమూ కూర్చున్నాం.

నిశ్చితార్థం నిర్విఘ్నంగా జరిగింది. శ్రావణి పెళ్లి అయిదురోజులుందనగా కాబోలు... ఆ రోజు బ్యాంక్ నుంచి ఆలస్యంగా వచ్చాను. శ్రీమతి హాల్లో సోఫాలో దిగాలుగా వెనక్కివాలి ఆలోచిస్తోంది. ఆవిడ ముందు సీతయ్య, కాంతమ్మలు నేలమీద నీరసంగా, నిస్తేజంగా చతికిలబడి ఉన్నారు. వాళ్ల ముఖాల్లో దైన్యం, దుఃఖం..

"ఏమిటి సీతయ్యా... ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాను.

సీతయ్య జవాబు చెప్పలేదు. కాంతమ్మ గొంతు విప్పలేదు. నా ప్రశ్నతో వాళ్లలో పెల్లుబికిన దుఃఖోద్వేగం నాకు ఆందోళన కలిగించింది.

"ఏమిటి విజయా.... ఏమయింది?" శ్రీమతి వైపు తిరగాను.

" శ్రావణి...పెళ్లి..." ఆమె అర్ధోక్తిగా ఆగిపోయింది.

"శ్రావణి పెళ్లి గురించా...? ఏం ఏదైనా ఆటంకం వచ్చిందా? డబ్బు అవసరమయితే

మనం సర్దుదాంలే..." భరోసాగా అన్నాను.

" డబ్బు విషయం కాదండీ..." శ్రీమతి స్వరంలోనూ ఏదో మార్పు...

" మరి? పెళ్లికొడుకు తరపున అభ్యంతరం వచ్చిందా? మధ్యవర్తి ఏదైనా తిరకాసు పెట్టాడా... ? ఏం జరిగింది?" శ్రీమతి నిదానం నన్ను నిలబడనివ్వలేదు. అంతా అయోమయంగా, అర్థం కాకుండా ఉంది.

" ఏమిటి సీతయ్యా...? చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది? ఏ సమస్యకైనా ఒక పరిష్కారం ఉంటుంది. చెప్పండి...!"

నా మాటలకి సీతయ్య కాంతమ్మలు ఉబికి వచ్చే దుఃఖాన్ని మరింతగా అణచిపెట్టుకుంటూ ఏడవసాగారు... శ్రీమతి చెప్పుకుపోయింది....!

" అదేనండీ! ఆ మధ్యవర్తి సలహా మీదే శ్రావణి ఒకసారి పెళ్లయిన పిల్లకదాని ఋతుసంబంధమైన ఇబ్బంది ఏదో ఉందని.... ఆసుపత్రికి మామూలుగా తీసుకువెళ్లారట. డాక్టరు ఏవో పరీక్షలు చేయించారట. ఆ పరీక్షల్లో శ్రావణికి హెచ్.ఐ.వి. కనిపించిందట. అదీ ఎక్కువ స్థాయిలోనే ఉందట...."

మనశ్శరీరాలు అదిరిపడ్డాయి. ఆపై శ్రీమతి మాటలు నాకు వినిపించలేదు. మెదడులో వేలభావాల విస్ఫోటనాలు-అనంత బాధాశకలాలుగా విడిపోయి అంతరంగాన్ని ఢీకొంటున్నాయి. ఎంత అన్యాయం.... మొదటి భర్తవల్ల .... వాడితో కొన్నినెలలు కాపురం చేసినందుకు శ్రావణికి దారుణమైన శిక్ష....? అనుమానం లేదు.... వాడు ఎయిడ్స్ రోగే. పెళ్లికి ముందు ఎక్కడెక్కడో చెడుతిరుగుళ్ళు తిరిగి.... రోగం తెచ్చుకుని, అన్నెంపున్నెం ఎరుగని ఈ అమాయక పిల్లకు అంటించి... చచ్చాడు రోగిష్టివెధవ...!

నాలో ఆక్రోశం, ఆవేదన ఎగసివచ్చాయి.... ! ఎవరిదీ తప్పు... ?

"మాదే తప్పు బావూ! ముమ్మాటికీ మావే నేరంసేసినాం... మేనరికమని మోజుపడి సేసుకుంటే ఆళ్ళు గుట్టుగా కుర్రోడి రోగం దాసిపెట్టి సెప్పాసెయ్యకుండా పెళ్ళికి గాబరా పెట్టేసినారు. పిల్లదాని బతుకు అగ్గిలోకి తోయిస్సినారు బావూ... ఇప్పుడేటి ఏటిదారి బగమంతుడా...!" సీతయ్య, కాంతమ్మ భోరుమని విలపిస్తున్నారు.

డాక్టరుతో ఇలా అని విషయం చెబితే శ్రావణికి మరో పెళ్లి చేయకూడదని ఖచ్చితంగా చెప్పాడటండీ... చేస్తే, వేరొకరిజీవితం నాశనం అయిపోతుందని నిర్ద్వందంగా చెప్పాడట. "హెచ్ఐవి" క్రిమి ఎయిడ్స్‌గా మారడానికి కొంతకాలం పడుతుంది. అంతవరకూ ఖరీదైన మందులు నిత్యం వాడితే... జీవితకాలాన్ని కొంత వరకూ పొడిగించుకోవచ్చు... ఎయిడ్స్ రోగానికి మందులేదు.... నివారణ ఒక్కటే మార్గం అని పదేపదే చెప్పాడుట. ఇదెక్కడి ఘోర మండీ....!?

శ్రీమతి కూడా దుఃఖాతిశయాన్ని తట్టుకోలేకపోతోంది.

మొన్న నిశ్చితార్థం రోజున... కొత్త అలంకరణలో... కొత్తకొత్త ఊహలతో... కళకళలాడిన శ్రావణి... గలగలా మాట్లాడే శ్రావణి... కిలకిలా నవ్వులు రువ్వే శ్రావణి...! ఒక అజ్ఞానానికి, ఒక అవగాహనారాహిత్యానికి ... ఒక అఘాయిత్యానికీ బలయిపోయిన ఆకుపచ్చని జీవితం శ్రావణి! పాపం, శాపగ్రస్త శ్రావణి...! నా కళ్లముందు ఒక వేదనామయ ప్రపంచం శ్రావణి... !

"తనకు హెచ్.ఐ.వి. ఉందన్న విషయం శ్రావణికి ఇంకా చెప్పలేదుటండీ... కొంతకాలం సీతయ్య, కాంతమ్మలు చెప్పొద్దు అనుకున్నారుట... తెలియకుండా ఉంచాలని..." శ్రీమతి చిన్నగా చెబుతూంది.

" నిశ్శబ్దాన్ని ఛేదించాలి విజయా! చెప్పకా తప్పదు.. చర్చించకా తప్పదు... శ్రావణిలాంటి అభాగ్యుల్ని సేదదీర్చాలి... అక్కున చేర్చుకోవాలి... ఆదరించాలి.... ఆత్మస్థైర్యాన్ని అందివ్వాలి... ఏదో ఒక ఆధారం చూపించాలి.!"

నా కంఠస్వరం నాకే తెలియనంత దృఢంగా వినిపించింది....!

❀ ❀ ❀ ❀ ❀ ❀

(ఆకాశవాణి విశాఖ ప్రసారం...

(ప్రచురణ : 'కథాకేళి' ఫిబ్రవరి - 2007)